ప్రజాశక్తి

గురువారం 8 డిసెంబర్ 2022 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

తరలివచ్చిన బిసిలు

అధికార వైసీపీ చేపట్టిన జయహో బీసీ మహాసభ విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బుధవారం జరిగింది. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి బీసీలు తరలివచ్చారు. బీసీ నేతలంతా కలిసి జ్యోతిప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ప్రారంభోపన్యాసం చేశారు. పార్టీ మినీప్లీనరీ తరహాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభకు వస్తున్న ఆహ్వానితుల సంఖ్యకు అనుగుణంగా సభ ప్రాంగణంతో పాటు అల్పాహారం, భోజన, వసతి ఏర్పాట్లు చేశారు. వెనుకబడిన తరగతులకు చెందిన పంచాయతీ వార్డు మెంబర్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులతో పాటు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారికి సైతం జయహో బీసీ మహాసభకు తరలివచ్చారు. మహాసభ కారణంగా విజయవాడ నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



సభకు హాజరైన బిసిలు, ప్రజాప్రతినిధులు ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న సిఎం జగన్

యాప్ సోపాలు



- నిలిచిపోయిన ధాన్యం సేకరణ సర్వర్
- ట్రిప్ సీట్ వస్తేనే మిల్లుల వద్ద లారీ నుంచి ధాన్యం అన్లోడ్
- తేమ శాతం పేరుతో మద్దతు ధరలో కోత
- సంచులు ఇవ్వడంలో జాప్యం
- ఆకాశంలో మబ్బులు... రైతుల గుండెల్లో రైళ్లు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ఆరుగాలం కష్టించి పండించిన పంటను మిల్లులకు తరలించేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్ల ప్రమేయం లేకుండా ఏర్పాట్లు చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. మంగళవారం నుంచి సర్వర్ నిలిచిపోయింది. ధాన్యం సేకరణ యాప్‌లో ఫోటోలు అప్ లోడ్ కావడం లేదు. యాప్ లో నమోదు పూర్తయిన తర్వాతే లారీలను దిగిమతి చేసుకువాలి. మంగళవారం నుండీ బుధవారం సాయంత్రం వరకు సర్వర్ పని చేయక యాప్‌లు మొరాయించాయి. లోడుతో ఉన్న లారీలు , ట్రాక్టర్ ట్రాలీలు మిల్లుల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో టెన్షన్..టెన్షన్

మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ కావడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయి. హార్వెస్టర్ ద్వారా నూర్పిడి పూర్తయిన తర్వాత ధాన్యం విక్రయించుకోవడంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. తేమ శాతం 17 లోపు ఉంటేనే మద్దతు ధర 75 కిలోలకు ఏ గ్రేడ్ ఇస్తామని సమస్య నుంచి బయటపడడానికి ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. రైతు పండించిన పంట ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనే ప్రభుత్వ ఆదేశాలు ఆచరణలో నోచుకోవడం లేదంటున్నారు. మిల్లర్లు, దళారులు ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నా ఆ మేరకు రెవెన్యూ, వ్యవసాయశాఖ దృష్టి కేంద్రీకరించడంలేదు. ఫలితంగా ధాన్యం త్వరితగతిన మిల్లులకు చేరడం లేదు. ఆర్బీకేల సిబ్బందితో (మిగతా 6లో)

ఆఫ్‌లైన్‌లో ధాన్యం సేకరణకు అనుమతి

శ్రీధర్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

ధాన్యం సేకరణలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తున్నాం. ధాన్యం సేకరణ సర్వర్ సమస్య ఏర్పడింది. ధాన్యం సేకరణకు సంబంధించి యాప్ అప్ లోడ్ అవ్వడం లేదు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆఫ్ లైన్‌లో ధాన్యం సేకరించాలని సూచించాం.

ఇళ్లు తొలగించకుండా రక్షణ గోడ నిర్మించాలి

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి వేసిన మార్కింగ్‌ను పరిశీలించిన సిపిఎం బృందం



రక్షణ గోడ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ

రిటైనింగ్ వాల్ నిర్మాణ నేపథ్యంలో స్థానిక ప్రజల సందేహాలను నివృత్తి చేసిన తరువాతనే గోడ నిర్మాణ పనులు ప్రారంభించాలని మాజీ కార్పొరేటర్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ కోరారు. కృష్ణలంక పద్మావతి ఘాట్ నుంచి వారధి వరకు రక్షణ గోడ నిర్మాణం కోసం నదిలో అధికారులు చేసిన మార్కింగ్‌ను స్థానిక సిపిఎం నాయకులతో కలిసి కాశీనాథ్ బుధవారం పరిలించారు. రక్షణ గోడ నిర్మాణం పేరుతో తమ గృహాలను తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇళ్లు కోల్పోతే రోడ్డు పాలవుతామని రణదివెనగర్ వాసులు వాపోయారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ రక్షణ గోడ నిర్మాణం పేరుతో ఇళ్లను తొలగిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కృష్ణానది వరదల ముంపు నుంచి నగర పరిధిలోని ఆయా ప్రాంతాల ప్రజలు, వారి ఇళ్లను, ఆస్తులను కాపాడాలని బాధిత ప్రజలను కలుపుకొని సిపిఎం ఏళ్ల తరబడి చేసిన పోరాటాల ఫలితంగానే రక్షణ గోడ నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వచ్చే వరదల నాటికి త్వరగా రక్షణ గోడ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ఇదే సమయంలో ఏ ఒక్క ఇంటిని కూడా తొలగించకుండానే గోడ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. జెండాలు పాతిన ప్రాంతంలో సాయిల్ పరీక్షలు చేయకుండా, ఇళ్లకు అనుకొని ఉన్న దగ్గర పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. జెండాలు పాతిన దగ్గర నుంచి 25 మీటర్ల పరిధిలో ఉన్న ఇళ్లను మాత్రమే తొలగించడం జరుగుతుందని కలెక్టర్ ఇచ్చిన హామీకి అనుగుణంగానే జిల్లా అధికారులు ఎలైన్‌మెంట్ పూర్తి చేసి, మార్కింగ్ వేయాలని డిమాండ్ చేశారు. గోడ నిర్మించే ఏరియాలోనే సాయిల్ టెస్ట్ చేయాలి ఇళ్ల మధ్యలో ఎందుకని ప్రశ్నించారు. ప్రజల భయాందోళనలను నివృత్తి చేసేందుకు తక్షణం స్థానిక (మిగతా 6లో)

శరవేగంగా విజయవాడ పశ్చిమ బైపాస్ పనులు

- 30 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు 80 శాతం పూర్తి
- పూర్తయిన చిన్న అవుటపల్లి, గొల్లపూడిపై ఓవర్ల నిర్మాణాలు
- పురోగతిలో మర్లపాలెం, గొల్లపూడి వద్ద ఆర్ఒబిలు
- నున్న-సూరంపల్లి మధ్యలో కొత్తగా టోల్ ప్లాజా ఏర్పాటు



ప్రజాశక్తి - విజయవాడ రూరల్

చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు నిర్మిస్తున్న ఆరు లైన్ల విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు మరో నాలుగు నెలల్లో వినియోగంలోకి రానుంది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు, కేంద్ర ప్రభుత్వం రూ.1,128 కోట్లతో 30 కిలోమీటర్ల పొడవున ఆరు లేన్ల జాతీయ బైపాస్‌ను మంజూరు చేసింది. ఈ హైవే రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నాయి. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు వినియోగంలోకి వస్తే విజయవాడలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుంది. విజయవాడ వెస్ట్ బైపాస్ కారణంగా హైదరాబాద్ నుంచి కోల్‌కతా వెళ్లే భారీ వాహనాలు విజయవాడలోకి ప్రవేశించాల్సిన అవసరం లేదు. భారీ వాహనాలు బైపాస్ మీదుగా జాతీయ రహదారిపై చిన అవుటపల్లిలోకి ప్రవేశిస్తాయి. కొత్త బైపాస్ 65, 16 జాతీయ రహదారులను అనుసంధానం చేసి నగరంలో ట్రాఫిక్ సమస్యను తగ్గిస్తోంది. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ ఏఐ) అధికారులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-3 పనులను మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్)కు అప్పగించగా, ఇప్పటి వరకు దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. 2023 ఫిబ్రవరి చివరి నాటికి కొత్త విజయవాడ వెస్ట్ బైపాస్ వినియోగంలోకి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి దాదాపు 450 ఎకరాల భూమిని సేకరించింది. విజయవాడ వెస్ట్ బైపాస్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు దాదాపు 800 మంది ఉద్యోగులు, కార్మికులు ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్నారు. 12 ప్రాంతాల్లో హైటెన్షన్ లైన్లు మారుతాయని, విద్యుత్ లైన్ పనులు పూర్తయితే మూడు నెలల్లో విజయవాడ వెస్ట్ బైపాస్ వినియోగంలోకి వచ్చే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారి ఒకరు తెలిపారు. విశాఖపట్నం-విజయవాడ ప్రధాన లైనులో చిన అవుటపల్లి, గొల్లపూడి వద్ద రెండు ఫ్లైఓవర్లు పూర్తయ్యాయని, గన్నవరంలోని మర్లపాలెం వద్ద రెండు రైల్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్ఓబి), విజయవాడ (మిగతా 6లో)

రక్త నమూనాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-మైలవరం : ప్రతి ఒక్కరు రక్త నమూనా పట్ల అవగాహన పెంచుకోవాలని ఎల్బీఆర్‌సిఈ వైస్ ప్రిన్సిపల్. డాక్టర్ కే హరినాద్ రెడ్డి అన్నారు. స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాలలో చేరిన విద్యార్థిని విద్యార్థులకు ఆంధ్ర ఆస్పటల్ విజయవాడ వారి సౌజన్యంతో రక్త నమూనా పరీక్షలు బుధవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు ఇతర విపత్తులు సంభవించినప్పుడు ఇతరులకు సహాయం చేయడానికి ముందుకు రావాలని రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెంపొందిం చడం ద్వారా ఆరోగ్యవం తులుగా ఉండడానికి అవకాశం ఉంటుందన్నారు. 1200 మందికి రక్త నమూనా పరీక్షలు నిర్వహించామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి శివ హరి ప్రసాద్ తెలిపారు.

పీసీసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి తరలిరండి

ప్రజాశక్తి-నందిగామ : డిసెంబరు 9 శుక్రవారం విజయవాడలో పిసిసి నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారంకు ప్రజలు తరలిరావాలని డీసీసీ అధ్యక్షులు బొర్రా కిరణ్, పీసీసీ మెంబెర్ పాలేటి సతీష్‌లు పిలుపునిచ్చారు. బుధవారం నందిగామ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పిసిసి నూతన అధ్యక్షుడిగా మాజీ ఎంఎల్సి గిడుగు రుద్రరాజు ఈనెల 9న విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పిసిసి కార్యదర్శి పోతురాజు ఏసు దాస్ ,పీసీసీ మెంబెర్ చిట్లురీ ప్రభావతి,మందా వజ్రయ్య,జి అనిల్, తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-నందిగామ : రాష్ట్ర సమాచార చీఫ్ కమిషనర్ ఆర్ఎం బాషాను ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పి.మీరాహుస్సేన్ ఖాన్, జర్నలిస్ట్ పఠాన్ సైదాఖాన్ ,న్యాయవాది కరీముల్లా ఖాన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు .జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు,హెల్త్ కార్డులు, ఇన్సూరెన్సు ,ప్రమాదభీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

జిఎస్ కేబుల్ నెట్ వర్క్ ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణంలో జిఎస్ డిజిటల్ కేబుల్ నెట్ వర్కు కార్యాలయంను శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ బుధవారం ప్రారం భించారు. ప్రజలకు అందుబాటులో వినోదం అందించా లని కోరారు. వైసిపి నాయకులు మస్తాన్,కట్టప్ప, కేబుల్ పార్టనర్స్ యం. డి గౌస్, రహమాన్,జాకీర్ హుస్సేన్, గోనెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నెట్‌వర్క్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి అరుణ్‌కుమార్

వ్యకాస మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మైలవరం

ఈనెల 8, 9, 10 తేదీలలో జంగారెడ్డి గూడెంలో జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర 29వ మహాసభలను జయప్రదం చేయాలని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోట కళ్యాణ్ పిలుపునిచ్చారు. మైలవరం మండలం మైలవరం భూ పోరాట కేంద్రంలో సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలు కూలి కోసం, భూమికోసం, ఉపాధి పరిరక్షణ కోసం జరుగుతున్నా యన్నారు. పేదల భూ హక్కుల పరిరక్షణ కోసం సంఘం అండగా ఉంటుందని. మహాసభల స్ఫూర్తితో రానున్న రోజుల్లో పేదల సాగు చేసుకుంటున్న బంజరు పోరం బోకు పట్టాలు ఇవ్వాలని ఉద్యమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పత్తిపాటి నాగేశ్వరరావు కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి సందీప్ షాకు, రమేష్, అబ్రహం,సురేంద్ర పాల్గొన్నారు..



భూ పోరాట కేంద్రంలో జెండా ఆవిష్కరించిన కోట కళ్యాణ్

పరిచయం లేని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కంచికచర్ల

నేటి సమాజంలో పసిపిల్లల నుండి పండు ముసలి వరకు మహిళలపై అత్యాచారాలు జరుగుతు న్నాయని కంచికచర్ల మండలం శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ భార్గవి పేర్కొన్నారు. బుధవారం కంచికచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన మహిళల స్నేహపూర్వక సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని బాలికలు తన తోటి మగవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారి నడవడిక ప్రవర్తనను గమనించి తల్లిదండ్రులకు తెలియ జేయాలని సూచిం చారు. ముఖ్యంగా పరిచయం లేని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బాలికలు అన్నింట లింగ వివక్షతకు గురవుతున్నారని నేటి సమాజంలో పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని బాలికలు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థితికి చేరుకోవడానికి నిర్విరామంగా కృషి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ తారాబి, కరీమా,అంగన్వాడీ కార్యకర్తలు వాణి,మహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు ఏపీఎం పాల్గొన్నారు



సదస్సులో మాట్లాడుతున్న సిడిపిఓ

సైనిక కుటుంబాలను ఆదుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : దేశ రక్షణకు ప్రాణాలను అర్పించిన సైనిక కుటుంబాలను ఆదుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పతాక నిధికి విరివిగా విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవం (ఫ్లాగ్‌డే) పురస్కరించుకుని బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డిల్లీరావు సాయుధ దళాల పతాక నిధికి విరాళం అందించి జిల్లా సైనిక సంక్షేమ అధికారి నుండి పతాకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ దేశ రక్షణ కొరకు పోరాడి ఆసువులుబాసిన సైనికుల కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాక దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. దేశ గౌరవాన్ని కాపాడేందుకు సరిహద్దుల్లో ధైర్యంగా పోరాడి వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించి వారి కుటుంబాలకు అండగా నిలిచే సంకల్పంతో 1949 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం డిసెంబర్ 7వ తేదిన సాయిధ దళాల పతాక దినోత్సవాన్ని పాటిస్తున్నామన్నారు. భారత సైనికులు మొక్కవోని దీక్షతో చూపుతున్న దేశభక్తి సాహసం త్యాగాల పట్ల దేశం గర్విస్తుందన్నారు. పాకిస్తాన్ చైనాలతో జరిగిన యుద్ధం సమయంలో కార్గిల్ పోరాటం ముంబై తాజ్ హోటల్ దురాక్రమణ వంటి సంఘటనలలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు భారత జవానుల ధైర్యసహసాలు తెగువకు జాతి యావత్తు గర్విస్తుందన్నారు. స్వచ్చందంగా విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చేవారు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ జిల్లా సైనిక సంక్షేమ అధికారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ఖాతా 62067742138 ఐఎఫ్ఎస్సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0020899 ద్వారా నేరుగా తమ విరాళాలు అందించ వచ్చునని జిల్లా కలెక్టర్ డిల్లీరావు అన్నారు.నగరానికి చెందిన పారిశ్రామిక వేత్త సాగి కృష్ణంరాజు మూడు లక్షల రూపాయలు, కెనరా బ్యాంక్ రీజనల్ ఆఫీసు విజయవాడ వారు ఒక లక్ష యాబై వేల రూపాయలు, పరుచూరి వెంకట కృష్ణారావు యాబై ఐదు రూపాయలు, రిటైర్డ్ ప్రిన్సిపల్ వై కాళీ వరప్రసాద్ శర్మ ఇరవై ఐదు వేల రూపాయలు చెక్కుల రూపంలో జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి సర్జస్ లెఫ్టినెంట్ కమాండర్ కె కళ్యాణ వీణ, మాజీ సైనిక సంక్షేమ సంఘము సభ్యులు మేరి స్టేల్లా, దుర్గమల్లేశ్వర మహిళ కళాశాల, నలంద కళాశాలకు చెందిన ఎస్‌సిసి విధ్యార్థులు పాల్గొన్నారు.

రామచంద్ర ఇంటిపై దాడికి ఖండన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం పుంగనూరులో రామచంద్ర యాదవ్‌నీ ఆయన నివాసంలో కలిసి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా బిసి నాయకులు మాట్లాడుతూ ఈ నెల 4 వ తేదీన రామచంద్ర యాదవ్ ఇంటిపై, ఆస్తులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రామచంద్రం యాదవ్ ఇంటి పై మూడు గంటలపాటు దాడి జరిగితే స్పందించని పోలీసులు, ఆయనకు సంఘీభావం తెలపడానికి రాష్ట్ర వ్యాప్తంగా పుంగనూరు వస్తున్న తమపై ఎక్కడికక్కడ భారీ గేడ్లు ఏర్పాటు చేసి అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. పుంగనూరులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కాకుండా వేరే రాజ్యాంగం నడుస్తుందని, బీసీలను అనగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, దాడి జరిగి మూడు రోజులు అయినప్పటికీ నిందితులను అరెస్టు చేయకపోవడం, సెక్షన్లు మార్చి కేసులు కట్టడం పోలీసుల వైఫల్యం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు బొలిగోర్ల రమేష్, పచ్చిపాల నాగేశ్వరరావు యాదవ్, కష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి ప్రసాద్ పాల్గొన్నారు.



హుండీ లెక్కింపు జల్లెడ బహూకరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో హుండీ లెక్కింపు చేసే నోట్లు కాయిన్స్ వేరు చేసే జల్లెడను బుధవారం నందిగామ మండలం చెరువ్వకొమ్ముమువారి పాలెం గ్రామస్తులు జమాళ్లపూడి వెంకట్రావు, లక్ష్మీ ల కుమారుడు మహేష్ చౌదరి ఆలయ కార్యనిర్వహణాధికారి కె. నాగరాజుకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు దుర్గ, శివ, సాయి, సేవాదళ్ అధ్యక్షులు ఉమామహేశ్వర రావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కానుమోలులో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : బాపులపాడు మండలం కానుమోలు గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జ్ లిఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో అనేక పరిశ్రమలు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు వచ్చారని, కానీ వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో పరిశ్రమలు జె-టాక్స్ కట్టాలని పారిశ్రామిక వేత్తలను బెదిరిస్తూ పరిశ్రమలు లేకుండా పారిపోయేల చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు వేరే ఇతర రాష్ట్రాలకి వలస వెళ్లి ఉద్యోగాలు చేసుకునే కర్మ పట్టించారన్నారు. బీసీలపై జగన్మోహన్ రెడ్డిది కపట ప్రేమ తప్ప మరొకటి లేదని అన్నారు. మండల అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్,రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మూల్పూరు కళ్యాణి, రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి చెనుబొయిన శివయ్య, గన్నవరం నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి. : ఎంఎల్ఎ


ప్రజాశక్తి-నందిగామ : క్రీడాకారుల ఎదుగుదలకు ప్రభుత్వం అదిక ప్రాధాన్యత ఇస్తుందని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని కె.వి.ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కృష్ణా యూనివర్సిటీ స్థాయి అంతర్ కళాశాలల ఉమెన్స్ కబడ్డీ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు నందిగామ శాసన సభ్యులు మొండితోక జగన్ మోహన్‌రావు బహు మతులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిం చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. విద్యార్థులు కూడా చదువుతోపాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. గెలుపు ఓటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో నడుచుకోవాలని తెలిపారు. కెవిఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రాయప్ప ,వాసిరెడ్డి బాబురావు ,పిజికల్ డైరెక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావు , అధ్యాపకులు వాసుదేవరావు , స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

బీసీ నిధులు దారిమళ్లించడం సిగ్గుచేటు : కొనకళ్ల

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ రావు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ బీసీ' లకు కార్యక్రమం బుధవారం నిర్వహించారు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న బిసి వ్యతిరేక వైఖరి , బిసి అణచివేత చర్యలను ఖండిస్తూ మచిలీపట్నంలో కృష్ణా జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం పాదయాత్రగా వెళ్లి కలెక్టర్ కి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ 34 వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించిన బీసీ ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమలు చేసిన 100 సంక్షేమ పథకాలను రద్దుచేసి, 34 వేల కోట్ల బీసీ నిధులను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దారి మళ్ళించడం సిగ్గుచేటు అన్నారు. 56 కార్పోరేషన్ లు పెట్టి వాటికి నిధులు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజక వర్గ ఇంచార్జి బాచ్చుల అర్జునుడు, గుడివాడ నియోజక వర్గ ఇంచార్జి రావి వెంకటేశ్వర రావు, పామర్రు నియోజకవర్గ ఇంచార్జి వర్ల కుమార్ రాజా, పెడన నియోజకవర్గ ఇంచార్జి కాగితం కృష్ణ ప్రసాద్, పెనమలూరు నియోజకవర్గ ఇంచార్జి బోడె ప్రసాద్, మచిలీపట్టణం పార్లమెంట్ ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు



రుద్రరాజుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

పిసిసి అధ్యక్షుడు రుద్రరాజుకు స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం : హైదరాబాద్ నుండి గన్నవరం విమానాశ్రయానికి బుధవారం పిసిసి అధ్యక్షులు రుద్రరాజు చేరుకున్నారు. ఆయనకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, జిల్లా ప్రెసిడెంట్ దనేకుల మురళి కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. ఈసందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ ప్రత్యేక హెూదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అన్నారు. పోలవరం మొదలు పెట్టింది కాంగ్రెస్ పార్టీ అని, కాంగ్రెస్‌ను గెలిపించుకొని పోలవరం పూర్తి చేసుకుందామన్నారు. వైస్సార్‌పార్టీ, జనసేన ,టీడీపీ పార్టీలలోఎవరు గెలిసినా బిజెపి తొత్తులేనని, బీజేపీకి ఎదురుతిరిగి పోరాడలేదన్నారు.

సమగ్ర భూసర్వేలో తప్పులను సరిదిద్దాలని వినతి

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన "వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష"ి పథకంలో పెద్ద ఎత్తున తప్పులు దొర్లాయని, వాటిని సరిదిద్దిన తర్వాతే పాస్ బుక్కులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్ భాషకు గ్రామ ప్రముఖులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగా మణి, ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, ఎంపీసీఎస్ అధ్యక్షులు మువ్వ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, శాసన మండలి సభ్యులు బచ్చుల అర్జునుడు నేతృత్వంలో ఒక ప్రతినిధి బందం మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా కు స్వయంగా వినతి పత్రం సమర్పించి రీసెర్వేలో జరిగిన లోటుపాట్లపై సమగ్రంగా చర్చించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రీసర్వేలో జరిగిన తప్పులు సరిదిద్ది రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-మోపిదేవి : పరిమితికి మించి కూలీలను ఆటోలపై తీసుకువెళ్లరాదని మోపిదేవి ఎస్ఐ సిహెచ్ పద్మ అన్నారు. మోపిదేవి, చల్లపల్లి పరిసర ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో బాపట్ల జిల్లా రేపల్లె, తదితర ప్రాంతాల నుండి వ్యవసాయ కూలీల ఆటోలపై పెద్ద సంఖ్యలో ఈ ప్రాంతాలకు తరలివస్తున్నారు. మోపిదేవి బయట హైవేపై వస్తున్న కూలీల ఆటోలను ఆపి ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సామాజిక భద్రత దృష్ట్యా, పరిమితి మించిన ప్రయాణాలతో వచ్చే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ఈ తనిఖీలు, కౌన్సిలింగ్ లు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆడవాళ్లను హత్య చేస్తే ఉరి శిక్ష వేయాలి

- కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ



ప్రజాశక్తి-గన్నవరం

రాష్ట్రంలో ఉన్మాదులు మృగాలుగా మరి ఆడవాళ్ళ జీవితాన్ని నాశనం చేస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ అన్నారు. బుధవారం గన్నవరం విమానాశ్రయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ వందలాది మందిని రక్షించే ఒక వైద్య విద్యార్థిని అతి కిరాతకంగా గొంతు కోసి చంపడం దారుణం అన్నారు. మంచి మంచి చదువులు చదువుకొని అభివృద్ధి చెందుతున్న మహిళలను ఏదోరకంగా మాయ చేసి మభ్యపెట్టి ప్రేమలోకి దించుతున్నారని చెప్పారు. వాళ్ల నిజరూపం తెలుసుకుని జాగ్రత్త పడుతున్న ఆడపిల్లలను భయభ్రాంతులకు గురిచేసి పెళ్లి చేసుకోక పోతే చంపేయడం దారుణం అన్నారు. ఇలాంటి వారిని నడిరోడ్డుపై ఎన్కౌంటర్ చేయాలన్నారు. వీరిని జైల్లో ఉంచి పోషించడం వల్ల వీరికి భయం లేకుండా పోయిందన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసై ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మహిళల కోసం నిర్భయ లాంటి చట్టాలు తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వం వీరికి ఉరిశిక్ష లాంటి చట్టాలు తీసుకొస్తేనే యువత ఇలాంటి దారుణాలు చేయాలంటే భయపడతారని అన్నారు. మహిళలపై దారుణాలకు పాల్పడే వారికి ఉరిశిక్ష వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మూడో రోజుకు సప్తమ బ్రహ్మోత్సవాలు



ప్రజాశక్తి గుడ్లవల్లేరు : దోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి బుధవారం గజ వాహనంపై విహరించారు. దోకిపర్రు మహాక్షేత్రం సప్తమ బ్రహ్మోత్సవాలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. మూడో రోజున ఉదయాన్నే సుప్రభాత, తోమాల సేవ, అర్చన కైంకర్యాల అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి, భూదేవి సహితంగా గజ వాహనంలో దోకిపర్రు గ్రామంలో విహరించి గ్రామస్తులు, భక్తుల నుంచి పూజలు అందుకున్నారు. అంతకు ముందు పాలు, నెయ్యి, తేనే తదితర సుగంధ ద్రవ్యాలతో శ్రీ వేంకటేశ్వరునికి అభిషేకం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరుని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు. సాయంత్రం రథోత్సవం జరిగింది. మూడో రోజు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పి వీకృష్ణారెడ్డి, సుధారెడ్డి పర్యవేక్షణలో జరిగిన పూజాదికాల్లో నిర్వాహకులు పి వీరారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం : సర్పంచ్

ప్రజాశక్తి-గన్నవరం : క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉమ్మడి జిల్లాల స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శీలం రంగారావు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి తోట అజయ్, పిడీ పూర్ణ చంద్రరావు, రాజేంద్రకుమార్, బలరాం ఇతర పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

కొడాలి శ్రీనుకు పితృవియోగం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్



ప్రభాకరరావు (ఫైల్)

సీనియర్ పాత్రికేయులు, ప్రజాశక్తి కలెక్టరేట్ రిపోర్టర్ కొడాలి శ్రీనుకు పితృవియోగం కలిగింది. బుధవారం తెల్లవారుజామున స్థానిక ఉల్లింగిపాలెంలోని స్వగృహంలో శ్రీను తండ్రి కొడాలి ప్రభాకరరావు (75) తీవ్ర అస్వస్థతకుగురై అకస్మాత్తుగా మృతిచెందారు. ప్రభాకరరావుకు 4 నలుగురు సంతానం. ప్రభాకరరావు ఇరిగేషన్ శాఖలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. ప్రభాకరరావు మృతిపట్ల జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారావు, కమిటీ సభ్యులు శ్రీహరి, సిఐటియు జిల్లా నాయకులు ఎం పోలి నాయుడు, నగర కార్యదర్శి బూర సుబ్రమణ్యం, సభ్యులు జయ్ రావు, యునుస్, వెంకట ప్రసాద్, బూర రాజశేఖర్ తదితరులు నివాళులర్పించారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఫోనులో సంతాపం వ్యక్తం చేశారు.

చేపల చెరువులో విషప్రయోగం ?

- రూ.6 లక్షలు విలువ చేసే చేపలు మృతి



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని విన్నకోట గ్రామంలోని 7 ఎకరాల సింగి చేపల చెరువు విషపూరితం కావటంతో ఆరు లక్షల విలువగల ఐదు టన్నుల చేపలు చనిపోయాయి. విన్నకోట పంచాయతీకి చెందిన సింగి చేపల చెరువు ఆ గ్రామ నిరుపేద కుటుంబాలకు చెందిన దళితులు సొసైటీ పేరున లీజు కు తీసుకొని చేపలు పెంపకం చేశారు. పంచాయతీకి చెల్లించవలసిన డబ్బును అప్పులు తెచ్చి చెల్లించినట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు. అయితే వీరిపై గిట్టని విన్నకోట గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు ఈ చెరువు విషపూరితం చేసి ఉంటారని ఆరోపిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

ప్రజాశక్తి-పెదపారుపూడి : అల్పపీడన ప్రభావంతో రెండు, మూడు రోజులలో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మండలంలోని రైతులు తమ పొలాలలోని వరి కోతలు నిలుపుదల చేయాలని మండల తహసీల్దార్ వరుకూటి నాగభూషణం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా బుధవారం తన కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. టీ. ఆంజనేయులుతో మాట్లాడారు. వరి కోత కోసిన పనలను కుప్పగా వేసుకోవాలని, ఒకవేళ హార్వెస్టర్ తో కోసిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ధాన్యం జాగ్రత్త చేసుకునే విషయంలో గాని, ధాన్యాన్ని అమ్ముకునే విషయంలో గానీ, ఏవైనా సలహాలు, సూచనల కు స్థానిక రెవెన్యూ, వ్యవసాయ కార్యాలయాలలో సంప్రదించవచ్చునని తహసీల్దార్ వివరించారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఉంగుటూరు మండల పాఠశాలల ఉపాధ్యాయులతో ఎంపీడీవో శేషగిరిరావు శ్రీ శక్తి భవన్ సభా మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుండి పాఠశాలలో ఎడ్యుకేషన్ విషయాలను ఎంఈఓ పరిశీలిస్తారన్నారు. నాడు-నేడు అభివృద్ధి పనులు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, వైయస్సార్ సంపూర్ణ పోషణ స్వేచ్ఛ, టాయిలెట్స్ నిర్వహణ, స్కూల్ ఫండింగ్ ఈ కార్యక్రమాలను వెలుగు ఏపిఎం పర్యవేక్షిస్తారన్నారు. పాఠ శాలల సక్రమ నిర్వహణకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

లైంగిక వేధింపుల నిషేధ చట్టంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మహిళలపై హింస, వివక్షతను రూపుమాపడం, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నిషేధ చట్టం-2013పై అవగాహన సదస్సును మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కృష్ణాజిల్లా, బాలల పరిరక్షణ విభాగం, ఐసిడిఎస్ మచిలీపట్నం అర్బన్ రూరల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక నోబల్ కాలేజ్‌లో బుధవారం నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్ సువర్ణ, నోబుల్ కాలేజ్ ప్రిన్సిపల్ శీలం జాన్ ఎర్నెస్ట్ మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలపై వివిధ రూపాల్లో జరుగుతున్న హింసను ఎదుర్కొనుటకు యువత సిద్ధంగా ఉండాలని, అవగాహన పెంచుకోవాలని సూచించారు. కాలేజీ ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ నుండి హాజరైన శాంతి మహిళా సాధికారత అనే అంశంపై అవగాహన కల్పించారు. అధికార సంస్థ అడ్వకేట్ పుల్లయ్య బాలల రక్షణ చట్టాలు, బాల్య వివాహ నిరోధ చట్టం, లైంగిక నేరాల నుండి బాలలను రక్షించే చట్టం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ సంస్థ, డిఆర్‌డిఏ, సచివాలయ ఉద్యోగులు, నోబుల్ కాలేజీ బాలురు బాలికలు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మీ

విద్యతోనే వివక్ష అంతం : ఎంపీపీ

ప్రజాశక్తి-వీరులపాడు : విద్యతోనే వివక్షకు స్వస్తి పలకవచ్చని, బాలికలు ఉన్నత చదువులపై దృష్టి సారిస్తే ఎలాంటి సవాళ్లైనా ఎదుర్కొనవచ్చని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. వీరు లపాడు మండల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ భవనంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో లింగ వివక్షత పైకిశోర బాలికల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలంటే చదువుపై ప్రత్యేక దష్టిసారించాలన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలు మగవారికి దీటుగా అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీ భార్గవి, సూపర్వైజర్లు ప్రభావతి, స్పందన,అంగన్వాడి కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో వంశీకృష్ణకు ఫెలోషిప్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ: నగరానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎం.జె.నాయుడు కుమారుడు డాక్టర్ వంశీకృష్ణ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలో ఫెలోషిప్ సాధించాడని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎం.రవితేజ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎం.వంశీకృష్ణ మణిపాల్ వైద్య కళాశాల నుండి ఆర్థోలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు.



అనంతరం డిఎన్‌బి డిగ్రీని పూర్తిచేసి యూకెలోని ఆర్థోపెడిక్స్ అండ్ రీజనరేషన్‌మెడిసిన్‌లో ఎంసిహెచ్‌ను , జర్మనీ దేశం హాంబర్గ్ నగరంలోని జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్ ఎండోక్లీనిక్‌లో జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలో ఫెలోషిప్ సాధించారని తెలిపారు. ఈసందర్భంగా నగరానికి చేరుకున్న డాక్టర్ వంశీకృష్ణను పలువురు వైద్యులు, అభినందించారు.

ఫిజియోథెరపీ క్యాంపు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం నాన్ భవిత కేంద్రంలో బుధవారం ఫిజియోథెరఫి క్యాంపు నిర్వహించారు. ఫిజియోథెరఫి డాక్టర్ శ్రీనివాస్ నేతత్వంలో వికలాంగులకు ప్రత్యేక ఫిజియోథెరఫి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్పి ఎస్ కె జాన్ బి, హెల్పర్ వనజ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పనులు గుర్తించండి

ప్రజాశక్తి - గంపలగూడెం : రానున్న కాలంలో ఉపాధి హామీ కూలీలకు కొరత లేకుండా పనులు గుర్తించాలని గంపలగూడెం ఎంపీడీవో వై పి రెడ్డి తెలిపారు. బుధవారం నాడు స్థానిక మండల పరిషత్ నందు ఉపాధి హామీ పనులకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అక్కడి ప్రజల అవసరాలకు తగ్గట్టుగా పనులు గుర్తించి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వరరావు , ఫీల్డ్ అసిస్టెంట్లు , ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు

విగ్రహాల ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి-వత్సవాయి : గ్రామాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, భారత దేశ ఉప ప్రధాని బాబు జగజీవన్ రావ్ విగ్రహాలను ఏర్పాటు చేయటం చాలా హర్షించదగ్గ విషయం అనికన్నెవీడు గ్రామ సర్పంచి చావ దుర్గారాణి శ్రీధర్ అన్నారు.కన్నెవీడు గ్రామంలో కన్నె వేడు ఆశయ సాధన కమిటీ ఆధ్వర్యంలో మహానీయుల విగ్రహ శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ పెద్దలు కర్నాటి వివేకు. కర్నాటి రఘు, ధారావత్ బాలాజీ, మాజీ సర్పంచి భీముడు, మాతంగివిమలమ్మ పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభల గోడ పత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-కంచికచర్ల : ఈ నెల 13 నుండి 16 వరకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వ విద్యాలయంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 17వ అఖిల భారత మహాసభలు జయప్రదం చేయలని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అద్యక్షులు ఎం సోమేశ్వర రావు పిలుపునిచ్చారు. మహాసభలు విజయం కోరుతూ స్థానిక శ్రీ అక్షర జూనియర్ కాలేజీ , కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావుతో కలిసి బుధవారం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో విద్యారంగ ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళపై అనేక తీర్మానాలు చేసి భవిష్యత్తు పోరాటాలు రూపకల్పన చస్తారన్నారు.. నరేంద్ర మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక జాతీయ విద్యా విధానం పేరుతో మొత్తం విద్య వ్యవస్థను ప్రైవేటీకరణ, కార్పొరేటికరణ, కాషాయీకరణ చేస్తుందన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ ప్రతిఏటా జాబ్ క్యాలండర్ విడుదల చేశాను అని చెప్పి ఇంతవరకు విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూళ్లలో 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా డీఎస్సీ నోటిఫికేషన్



కంచికచర్లలో ...



విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో...

విడుదల చేయలేదన్నారు. అలాగే జీవో నెం 77తో విద్యార్థులకు వసతి దీవెన అందడంలేదదని ఆరోపించారు. రాష్ట్రంలో నాడు-నేడు పేరుతో పాఠశాలలకు లక్షల నిధులు కేటాయించినా పూర్తి స్థాయిలో పనులు పూర్తి కాలేదన్నారు. 3,4,5 తరగతుల విలీనం పేరుతో అదే పాఠశాలలను మూత వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ కార్యదర్శి జి.గోపినాయక్, ఎస్ఎఫ్ఐ కంచికచర్ల మండల కార్యదర్శి ఎస్.కె బాషా, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె.జాహిదా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : హైదరాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో జరిగే ఎస్ఎఫ్ఐ మహాసభలు వాల్ పోస్టర్లు గొల్లపూడి గాయత్రి కాలెజిలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సోమేశ్వరరావు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యారంగ ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళపై అనేక తీర్మానాలు చేసి భవిష్యత్తు పోరాటాలు రూపకల్పన చేయనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.గోపినాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్.కె బాషా, తదితరులు పాల్గొన్నారు.

వివక్ష నుంచి విముక్తికి మార్గం అంబేద్కరిజం



ప్రజాశక్తి-నందిగామ : నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో, డా.బి.ఆర్.అంబేద్కర్ 66వ వర్ధంతి సందర్భంగా నందిగామలో స్థానిక యాదవ బజారులో బుధవారం దళితులను సన్మానించారు. సభకు బహుజన సేవా సమితి జిల్లా అద్యక్షులు ప్రత్తిపాటి సూర్యం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఎజిఎం బాబూజీ పాల్గొని మాట్లాడుతూ దేశంలో పీడనకు గురౌతున్న స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రకుల పేదలకు అంబేద్కరిజం విముక్తి మార్గం చూపుతుందన్నారు. భారతీయ సమాజంలో ఉన్న అన్నివిధాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సమ సమాజాన్ని స్థాపించేందుకు అంబేద్కర్ తత్వశాస్త్రం జ్ఞాన ఆయుధంగా ఉపకరిస్తుందని అన్నారు. ఆయన తన జీవిత కాలంలో అనేక ఒడిదుడుకుల నెదుర్కొని, అనేక పోరాటాలు చేసి, ఎన్నో హక్కులు సాధించారని, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కషి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో విశిష్ట అతిధులు కె.జడ్.ఎస్ కుమార్, పెసరమల్లి శేఖర్ రావు, దళిత చైతన్య వేదిక నాయకులు కన్నెగంటి సజ్జనరావు, జాషువా ఫౌండేషన్ నాయకులు కోట రవీంద్ర నాథ్,ప్రభుదాసు, స్నేహాక్లబ్ నాయకులు జాన్ మత్తయ్య పాల్గొన్నారు.



హెరిటేజ్ ఆధ్వర్యంలో ఉచిత మందులు పంపిణీ

ప్రజాశక్తి-వత్సవాయి : హెరిటేజ్ ఆధ్వర్యంలో పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ నిర్వహిస్తున్నట్లు రీజనల్ మేనేజర్ కె. బి నరసింహారావు అన్నారు. మండలంలోని పెదమోదుగుపల్లి గ్రామంలో పాలచేతల కేంద్రంలో హెరిటేజ్ వారి ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల దాన, క్యాల్షియం, మరియు పాడిపదార్థములు, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. కంపెనీ నుండి పాడి రైతులకు మందులు తక్కువ ధరకు అందిస్తున్నట్లు తెలిపారు. పశువుల ఆరోగ్య సంరక్షణకు హెరిటేజ్ కంపెనీ ఎంతగానో ఉపయోగపడుతుందని, అంతేకాకుండా 24 గంటలు వైద్య సదుపాయం అందిసు న్నామని అన్నారు. నత్తల నివారణకు మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాడి రైతులకు రెండు లక్షల రూపాయలు ప్రమాద బీమా పథకం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్ సతీష్ రెడ్డి, ప్లాంట్ మేనేజర్ సురేష్, నవీన్ , రైతులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు అందజేత

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

రెడ్డిగూడెం మండల పరిధి లోని కూనప రాజు పర్వ పిఎసిఎస్ ద్వారా 28 మంది రైతులకు దీర్ఘకాలిక రుణాల కింద కోటి 38 లక్షల 90 వేల రూపాయలను మంగళవారం కూనపరాజుపర్వ పిఎసిఎస్ అధ్యక్షులు పాలంకి మోహన మురళి రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల కోసం అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని అన్నారు. రైతన్నకి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో ఎంతో మేలు జరుగుతుందని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా ఆర్బికె లను స్థాపించి దేశం మొత్తం కూడా ఆంధ్రప్రదేశ్ వైపు చూసే విధంగా చేశారన్నారు. మేనేజర్ లక్ష్మీప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ ఆంజనేయ ప్రసాద్, సూపర్ వైజర్ గోపాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములపై పెద్దల కన్ను

- వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి-మైలవరం

పేదల భూములపై పెద్దలు కన్ను పడింది. ఎన్నో ఏళ్లుగా తమకు వచ్చిన భూములను ఆ పేదలు సాగు చేసుకుంటున్నారు. ఆ భూమి విలువ లక్షల్లో పలుకుతుంది. దీంతో కొంతమంది పెద్దలు దొంగ పత్రాలు సృష్టించి ఆ భూములు తమవని పేదలను బెదిరిస్తున్నారు. అండా దండాలేని ఆ పేదలు ఏం చేయాలో వారికి పాలుపోలేదు. ఈ సమయంలో వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఆశ్రయించారు దొంగ పత్రాలు సష్టించిన కొంతమంది పెద్దలు బుధవారం రెవెన్యూ అధికారులతో సర్వే కోసం వచ్చారు. వారిని బాధితులతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అడ్డుకున్నారు, ఈ సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ప్రకారం మైలవరం రెవెన్యూ పరిధిలోని 321-1 321/9 సర్వే నెంబర్లలో సుమారు 30 ఎకరాలు ఉంది. ఈ భూమిని అప్పటి ప్రభుత్వం 1977 లో, మైలవరం గ్రామానికి చెందిన చినర్జనవాడ దళితులకు 14 కుటుంబాలకు 1 ఎకరం చొప్పున కేటాయించింది. అప్పట్నుంచి వారు సాగు చేసుకుంటూ ఉన్నారు. ఆ భూములు విలువ కాలక్రమమైన పెరగడంతో ఈ నేపథ్యంలో కొందరు దళారులు పెద్దలు కుమ్మక్కై నకిలీ పత్రాలు సష్టించి మా భూమి అంటే మా భూమి అంటూ ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. పేదలైన దళితులు వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఆశ్రయించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాధితులతో కలిసి ఆక్రమణదారు లను వెళ్లగొట్టారు. మరల కొంతమంది రెవెన్యూ సిబ్బందిని వెంటబెట్టుకొని బుధవారం దళితుల భూముల్లోకి ప్రత్యక్షమయ్యారు. విషయం తెలుసుకున్న పేదలు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి సర్వే కోసం వచ్చిన వారిని అడ్డుకున్నారు. అక్కడ కొంత సేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. ఎవరైతే తమ భూమి అంటున్నారు వారందరూ వాళ్ళ దగ్గర ఉన్న పత్రాలు తీసుకొని గురువారం మైలవరం తాసిల్దార్ కార్యాలయానికి రావాలిసిందని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్ మరికొందరితో కలిసి రెవిన్యూ అధికారులకు తమ సమస్యను వివరించారు.



రెవిన్యూ అధికారులకు అర్జీలు అందజేస్తున్న కోట కళ్యాణ్, బాధితులు

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 5
గురువారం 8 డిసెంబర్ 2022

తుపాను హెచ్చరికతో రైతుల గుండెల్లో గుబులు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

మండలంలోని వల్లూరు పాలెం గ్రామంలో కృష్ణా నది పాయ ఒడ్డున వందలాది ఎకరాల్లో సాగు చేసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకున్నారు. రైతులు మిషన్ల ద్వారా కోత కోయించుకుని తమ పంట



ఆరబెట్టుకునేందుకు విశాలమైన ఖాళీ ఉన్న కృష్ణానది పాయ ఒడ్డున ఆరబెట్టుకుంటున్నారు. తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుని 15 రోజులు గడుస్తున్నా ఆర్బికే అధికారులు వచ్చి తమ ధాన్యంలో ఇంకా తేమశాతం ఉందని సాకులు చెబుతూ, కాటా వేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొంతమంది రైతులు తమ ధాన్యాన్ని కాటా వేసి 5 రోజులు గడుస్తున్నప్పటికి లారీల్లో లోడింగ్ చేయకపోవడం వలన పరదాలు కప్పి ధాన్యాన్ని రోజులు తరబడి నిల్వవుంచాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. 15 రోజులుగా రైతులు ధాన్యాన్ని నిలవ ఉంచడానికి పరదాలకు చాలా ఖర్చు అవుతుందని. రోజువారి ధాన్యాన్ని తిరగవేస్తూ ఆరబెట్టడానికి కూలీల ఖర్చు అధికంగా అవుతుందని తమ గోడును ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన రైతుకు తమ ధాన్యాన్ని అమ్ముకునే శక్తి లేకపోవడం, అధికారులు కోసం ఎదురు చూపులు చూడడం వంటి కారణాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరో పక్క వాతావరణ శాఖ సూచనల మేరకు తుఫాను ప్రభావం వల్ల రెండు, మూడు రోజులు అధిక వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, దీనివల్ల ఆరబెట్టుకున్న తమ ధాన్యం తడిసి ముద్దయిపోతే తమ జీవనోపాధి దెబ్బతింటుందని, లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని సైతం అధికారులు తరలించే ప్రయత్నం చేయడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ ధాన్యాన్ని తరలించే ప్రయత్నం చేయాలనీ తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

వీర జవాన్లకు వందనం సమర్పించేందుకు వారి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకే సాయుధ దళాల పతాక దినోత్సవ ముఖ్య ఉద్దేశమని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన కలెక్టర్ బంగ్లాలో



సాయుధ దళాల పతాక దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సైనిక సంక్షేమ అధికారిణి సర్జన్ లెఫ్టినెంట్ కమాండర్ కళ్యాణ వీణ.కె (రిటైర్డ్) కలెక్టర్‌కు పతాక నిధి జెండాను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మంది సైనికులు దేశ రక్షణలో తమ ప్రాణాలు తృణప్రాయంగా అర్పించారన్నారు. జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘ సభ్యులు, మచిలీపట్నం సైనిక సంక్షేమ సంఘ అధ్యక్షులు గాడెల్లి వసంతరావు, ముఖ్య కార్యదర్శి శరత్ బాబు, కార్యనిర్వహణ కార్యదర్శి ఎన్.వాల్టర్స్, వై.లక్ష్మణ రావు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి రంగంలో రాణించాలి

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం కేసరపల్లి పంచాయతీ కార్యాలయంలో మగ్గం , ఎంబ్రాయిడరీ, టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ లక్ష్మీ మౌనిక రిబ్బన్ కటింగ్ చేసి బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ మౌనిక మాట్లాడుతూ వాసవ్య మహిళా మండలి గత 50 సంవత్సరాలుగా మహిళల అభివృద్ధికి,వారి జీవనోపాధికి తోడ్పాటు అందించటానికి అనేక కార్యక్రమాలు



మాట్లాడుతున్న కేసరపల్లి సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక

చేస్తోందన్నారు. మహిళలను చైతన్యవంతులను చేయటానికి కషి చేస్తోందని వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా గన్నవరం మండలంలో చిరు వ్యాపారులకు ఆర్థిక తోడ్పాటు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేసి గన్నవరం మండల ప్రాంత మహిళలకు చేయూతను అందించటం ఎంతో ఆనందమని కొనియాడారు . ప్రస్తుతం ఈ ట్రైనింగ్ సెంటరు మన పంచాయితీ ఆఫీసు కార్యాలయం నందు ఏర్పాటు చేసి కేసరపల్లి ప్రాంత మహిళలకు శిక్షణ ఇస్తున్నందుకు సంతోషం వ్యక్తంచేశారు. వాసవ్య మహిళా మండలి హెచ్ సి ఎల్ ఫౌండేషన్ కేసరపల్లి ఇన్చార్ట్ టి.కేశవ, వాసవ్య మహిళా మండలి సభ్యులు, కేసరపల్లి గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు తరలివచ్చిన బిసిలు



గుడివాడలో

గుడివాడ : విజయవాడలో బుధవారం జరిగిన జయహో బీసీ సభకు గుడివాడ నుండి వైసీపీ శ్రేణులు తరలివెళ్లారు. స్థానిక వైసపీ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ గోళ్ళ రామకృష్ణ జెండాను ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరావు (నాని) నాయకత్వంలో పెద్ద సంఖ్యలో నియోజకవర్గ వ్యాప్తంగా బస్సులు, కార్లలో మండలాల వారీగా, తరలి వెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ మండలం వైసిపి అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, నియోజకవర్గ బూత్ కమిటీల ఇన్చార్జ్ కొంకితల ఆంజనేయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. **పెదపారుపూడి:** విజయవాడలో జరప తలపెట్టిన బీసీ సభకు పెదపారుపూడి మండలం నుంచి ఎంపీపీ గోగం సురేష్ ఆధ్వర్యంలో బుధవారం మండల నుంచి వైసీపీ నాయకులు తరలివెళ్లారు.



పెదపారుపూడిలో

వికలాంగులకు చదువు ఎంతో అవసరం

గన్నవరం : వికలాంగులు చదువుకుంటే వారి తల్లిదండ్రులు కళ్ళలో కోటి దీపాల వెలుగులు వస్తాయని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ అన్నారు. బుధవారం వీరపనేని గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆవుల మనోహరి మానసిక వికలాంగురాలు. ఆ బాలిక పదో తరగతి పరీక్ష రాయటానికి నిర్ణీత వయస్సు లేకపోవడంతో స్పందన వెంకట్ స్వయంగా గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి డాక్టర్ సారమ్మతో మాట్లాడి అందజేయించారు. మనోహరి తల్లిదండ్రులు వెంకట్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎంతో నిబద్ధతతో సహకారాలు అందించిన గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి కౌన్సిలర్ రాజశేఖర్, చైర్మన్ వెంకట్ అభినందనలు తెలిపారు.

ఆర్‌బికెలతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కంకిపాడు

రైతు భరోసా కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని కొనగోలు చేయాలని ఎపి కౌలు రైతుసంఘం కంకిపాడు మండల అధ్యక్షులు పి.దుర్గాప్రసాద్, కార్యదర్శి వి.శివశంకరరావు, నాయకులు వి.మరియదాసు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. రైతు భరోసా కేంద్రం వద్ద 18 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని తీసుకుంటున్నారనీ, రైసుమిల్లుల వద్ద మాత్రం 20వర్తింప చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆన్‌లైన్ సమస్యలు వస్తుండటంతో రైతులు గత్యంతరం లేనిపరిస్థితుల్లో తక్కువ ధరలకు విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొంటోందని విమర్శించారు.

గణతంత్ర వేడుకలకు కెఆర్‌యు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కృష్ణా యూనివర్శిటీ, దాని అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ల నుండి విద్యార్థులు గత నెల నవంబర్ 20 నుండి 29 వరకు గుజరాత్‌లో జరిగిన గణతంత్ర వేడుకల రిహార్సల్‌లో పాల్గొన్నారు. వర్శిటీలోని ఇంజనీరింగ్ క్యాంపస్ నుండి బి.గోపి, విజయవాడ నుండి దాని అనుబంధ కళాశాలలైన నలంద నుండి కిరణ్ కుమార్,లయోలా కళాశాల నుండి పద్మ వీరిలో



విద్యార్థులను అభినందిస్తున్న విసి ఆచార్య కె.బి.చంద్రశేఖర్

ఉన్నారు ఢిల్లీలోని ఎర్రకోటపై జరిగే 73వ గణతంత్ర వేడుకలను గుజరాత్‌లోని వల్లభ విద్యానగర్ జిల్లా సర్దార్ పటేల్ యూనివర్శిటీలో జరిగాయి. రాష్ట్రంలోని 13 యూనివర్శిటీల నుండి 44 మందిని ఎంపికచేసి పంపగా తదుపరి కార్యాచరణలో భాగంగా ఈ 44 నుండి 9 మందిని ఎంపిక చేసి ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు పంపించనున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన విద్యార్థులను వర్శిటీ ఉపకులపతి ఆచార్య కె.బి.చంద్రశేఖర్ అభినందించారు. వర్శిటీ, దాని అనుబంధ కళాశాలలైన ఎన్ఎస్ఎస్ యూనిట్ల నుండి సేవా కార్యక్రమాలకే పరిమితం అవ్వకుండా అన్ని రంగాల్లోనూ విద్యార్థులు చురుకుగా ఉండి నైపుణ్యాన్ని సాధించాలన్నారు. ఇంకా ఆయనను కలిసిన వాళ్లలో వర్శిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త, క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.బాబురెడ్డి ఉన్నారు.

అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ 40వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్



బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి అధ్యక్షత వహించారు అభ్యాసకుల సహాయ కేంద్రం సమన్వయకర్త ఆర్.ఆలంకారావు మాట్లాడుతూ విభిన్న కారణాలతో విద్యను మధ్యలో ఆపేసిన వారికి అంబేద్కర్ విశ్వవిద్యాలయం మహా వృక్షం లాంటిదన్నారు. అభ్యాసకుల సహాయ కేంద్రం విద్యార్థులు పూర్వ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యయన కేంద్రం సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్ టి లక్ష్మీనారాయణ, ఆఫీస్ అసిస్టెంట్ బచ్చు ఆదినారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు రక్షణేదీ : వర్ల

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోయిందని టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. పమిడిముక్కల మండలంలోని అమీనాపురంలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమంలో భాగంగా బుధవారంనాడు కొవ్వొత్తుల ప్రదర్శన జరిపారు. పమిడిముక్కల మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని తపస్వి హత్యకు గురికావటం దారుణమన్నారు. వైసిపి పాలనలో మహిళలు, ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎర్రబోతున్న సురేష్ శంకర్రావు, జక్కా శ్రీనివాసరావు, అరుసుమల్లి కృష్ణప్రియ, మైనేని ఇందిర, బాబి, లక్ష్మీనారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తపస్వి మృతికి కొవ్వొత్తులతో నివాళి

మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందజేత

ప్రజాశక్తి-ఘంటసాల

కొడాలిలోని ఎస్సీ కాలనీకి చెందిన పెనుమూడి నాగరాజు (29) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. వైఎస్సార్ బీమా కింద మట్టి ఖర్చులు నిమిత్తం రూ.10 వేలను భార్య పెనుమూడి దీపికకు అందజేశారు. సర్పంచ్ చలపతి రాణి, ఇంచార్జ్ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీలత నాగరాజు భార్య దీపికను పరామర్శించి రూ 10 వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ చిట్టూరి రజినికుమారి పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

ఇళ్లు తొలగించకుండా రక్షణ గోడ నిర్మించాలి

ప్రజలతో అధికారులు సమావేశం నిర్వహించి ఇక్కడ జరుగుతున్న పనుల తీరు, ఇళ్ల పరిస్థితి, రక్షణగోడ నిర్మాణం తదితర అంశాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శివర్గ సభ్యులు పుప్పాల కృష్ణ, నాయకులు కోరాడ రమణ, లక్ష్మీనారాయణ, తాడి రమణ, పి శ్రీరాములు, ఎ లక్ష్మణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాప్ సోపాలు

మిల్లర్లు, దళారులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 1.71 లక్షల హెక్టార్లలో వరి సాగైంది. 5.20 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 360 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఏ గ్రేడ్ రకం ధాన్యాన్ని క్వింటాలు రూ.2,060, సాధారణ రకం రూ.2,040 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ఇదిలా ఉండగా ఆరబెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లి పరీక్షిస్తే తేమ 17శాతం లోపే ఉన్నట్టు ఆర్బీకేల్లో ఉన్న టెక్నికల్ సిబ్బంది చెబుతుంటే కొన్ని సందర్భాల్లో మిల్లులో పరీక్షించి ఆర్బీకేల్లో చూపించిన శాతం కంటే 4 నుంచి 5 వరకు ఎక్కువ శాతం ఉన్నట్టు తేడా చూపిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. 17 పాయింట్ల కన్నా అధికంగా తేమశాతం ఉంటే ఒక్కో పాయింటుకు రూ.20 చొప్పున ధాన్యం ధరలో కోత పెడుతున్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ

విద్యుత్ వినియోగదారులకు అంతరాయాలను తగ్గిస్తూ నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎపిసిపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జె పద్మ జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఇ) సమావేశం మందిరంలో డిస్కమ్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్స్ , ఎంబిఎ విభాగాల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ , అసిస్టెంట్ ఇంజినీర్స్‌తో బుధవారం చైర్మన్ అండ్ఎండి పద్మ జనార్ధన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్లలోని పాత పిటిఆర్‌లను, బ్రేకర్స్‌ను తనిఖీ చేసి, వాటిని అవసరమైన చోట కొత్త వాటితో మార్చి విద్యుత్ వినియోగదారులకు నిరంతరం విద్యుత్‌ను అందించాలని కోరారు. సబ్‌స్టేషన్లలో లైట్నింగ్ అరెస్టర్స్, పిటిఆర్‌లకు ఎర్తింగ్ చేయాలని ఆదేశించారు. హెచ్‌టి, ఎల్‌టి సర్వీసులను తరుచూ తనిఖీలు నిర్వహించి వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని , ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని చైర్మన్ ఆదేశించారు. ఈ సమావేశంలో టెక్నికల్ డైరెక్టర్ బి జయభరత్‌రావు,ఒఅండ్ఎం సిజిఎం ఎం వి రవి, ప్లానింగ్ సిజిఎం సుబ్బారావు పాల్గొన్నారు.

'మత్తు'తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు : ఐద్వా



విద్యార్థులతో మాట్లాడుతున్న శేషుమణి, ఆదిలక్ష్మి

ప్రజాశక్తి-భవానీపురం: నేడు సమాజంలో యువతీ యువకులు మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాను నాశనం చేసుకుంటున్నారని, మత్తు, మద్యం వంటి వాటికి దూరంగా ఉండి, మంచి విద్యను అందిపుచ్చుకోవాలని ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్షురాలు కుండనాల శేషుమణి విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. బుధవారం విద్యాధరపురం కుమ్మరిపాలెంలో గల దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్ (డిఎస్‌సిఎం) స్కూల్‌లో నవంబర్ 25 హింసా వ్యతిరేక దినోత్సవాల సందర్భంగా ఐద్వా పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థుల కోసం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశ్చిమ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కుండనాల శేషుమణి, గాదె ఆదిలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యంకు, మత్తు మందులకు బానిసలైన యువకులు ఆ మత్తులో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తూ, అత్యాచారాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మహిళల రక్షణ కోసం కఠినమైన చట్టాలు అమలు చేయాల్సిన అవసరం వుందన్నారు. విద్యార్థినీ విద్యార్థులు సెల్ ఫోన్లకు అలవాడు పడి వారి భవిష్యత్తుని పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కష్టపడి తమను చదివిస్తున్నారన్న సంగతి మరిచిపోకుండా మంచి చదువు చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. నేడు ఆడపిల్లలు మగవారితో పాటు సమానంగా అన్నింట్లోనూ ధైర్యంగా ముందుకు వెళు_న్నారని తెలిపారు. మహిళలు తమకు ఇబ్బందులు ఉంటే పెద్దలతో చెప్పుకొని సమస్య పరిష్కరించుకోవాలి గాని ఆత్మహత్యలకు పాల్పడరాదని హితవు పలికారు. హత్యలు, అత్యాచారాలు పెరగడానికి కారణమైన హింసను ప్రేరేపించే మత్తు పదార్థాలు జోలికి వెళ్లకుండా ఉండాలని కోరారు. అలాగే 52వ డివిజన్‌లో హింసకు వ్యతిరేకంగా స్థానికులతో గ్రూఫ్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పశ్చిమ నగర ఆఫీస్ బేరర్ విక్రమ్ లక్ష్మీ, వి స్వప్న, హైస్కూల్ టీచర్ రాజలక్ష్మి, 52వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో ఐద్వా డివిజన్ కార్యదర్శి కే. వెంకటరత్నం, కే. ఉషారాణి, వి స్వప్న, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

శరవేగంగా విజయవాడ పశ్చిమ బైపాస్ పనులు

సమీపంలోని గొల్లపూడిలో నిర్మిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గన్నవరం-ఆగిరిపల్లి రహదారిపై గన్నవరంలోని బీబీ గూడెం వద్ద, గొల్లపూడి-జక్కంపూడి రహదారి వద్ద బుడమేరు వద్ద రెండు ప్రధాన వంతెనలు కూడా పూర్తయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

డ్రైవర్లకు సౌకర్యాలు కల్పించేందుకు రెండు 'ట్రక్ లే బేలు'

ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు రెండు 'ట్రక్ లే బే'లను ప్రతిపాదించగా, అందులో ఒకటి చిన్న అవుటపల్లికి 9వ కిలోమీటరు వద్ద, రెండోది విజయవాడ వెస్ట్ బైపాస్‌లో 19వ కిలోమీటరు వద్ద నిర్మాణంలో ఉంది. ట్రక్ డ్రైవర్లు, క్లీనర్ల సౌకర్యార్థం వర్క్ ఏజెన్సీ విశ్రాంతి గదులు, టాయిలెట్లను నిర్మిస్తోంది. విజయవాడ రూరల్ మండలం నున్న, గన్నవరం మండలం ముస్తాబాద మధ్య చిన్న అవుటపల్లి వైపు నుంచి 13వ కిలోమీటరు వద్ద టోల్‌ప్లాజా నిర్మిస్తోంది. కొత్త టోల్ ప్లాజా పూర్తయిన తర్వాత పొట్టిపాడు టోల్ ప్లాజాను తొలగిస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి. గ్రీన్ ఫీల్డ్ హైవే వినియోగంలోకి వస్తే హైదరాబాద్ విశాఖపట్నం నుంచి దాదాపు 25 కి.మీ దూరం తగ్గుతుంది.

నిర్మాణంలో ప్యాకేజీ-4 పనులు

ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి నుంచి గుంటూరు జిల్లా చినకాకాని వరకు ప్యాకేజీ-4 పనులు జరుగుతున్నాయని, ఈ ప్యాకేజీలో భాగంగా కృష్ణానదిపై రెండు రెండు లైన్ల వంతెనల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. ప్యాకేజీ పూర్తయితే హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే ట్రాఫిక్ విజయవాడలోకి రాకపోవచ్చు. ప్యాకేజీ 3 ఫిబ్రవరి చివరి నాటికి పూర్తవుతుందని, 2023 చివరి నాటికి ప్యాకేజీ 4 పూర్తవుతుందని ఆ వర్గాలు తెలిపాయి.

ప్రకటన
మహారాజశ్రీ విజయవాడ 12వ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టులో
ఎ.ఎస్.నెం. 43/2020

పారా పాములమ్మ ... అప్పిలెంట్
వర్సెస్
యర్రగుంట్ల భూపతిరావు మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్

6వ రెస్పాండెంట్ చిరునామా :
బొర్రా నాగమణి, భర్త : రాఘవయ్య, చిలుకూరు, ఇబ్రహీంపట్నం మండలం, ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు అప్పీలులో మీకు నోటీసును పత్రికా ముఖంగా తెలియజేయుటకు పై కోర్టువారు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున మీరు పై కోర్టువారిఎదుట ది. 21-12-2022వ తేదీన ఉదయం 10-30 గం.లకు ప్రత్యక్షంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలసినది. లేనియెడల మీ అప్పీల్‌ను మీ పరోక్షమున తీర్మానం చేయుదురు.

విజయవాడ.

(బై ఆర్డర్)

ఎం.రవికుమార్,
అడ్వకేట్,
అరండల్‌పేట, విజయవాడ.
సెల్ : 92464 73604.

మహారాజశ్రీ విజయవాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి దివ్యసముఖమునకు
ఓ.యస్. 317/2014
ఇ.పి. 106/2021
బిట్వీన్ :
పెనుమత్స వెంకట సీతారామరాజు ... డి.హెచ్.ఆర్.
అండ్
దల్లి సూర్యనారాయణ ... జె.డి.ఆర్.
తండ్రి లేటు రాము, ఆర్/ఓ, డి.నెం. 9-23-42, నెహ్రూ స్టాట్యూ సెంటర్, పోతినేని వారి వీధి, కొత్తపేట, విజయవాడ.

పై .ఇ.పి. నందు పైన తెలిపిన జెడిఆర్‌కు నోటీసులు అందజేయు నిమిత్తం ది. 14-12-2022వ తేదీకి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన జెడిఆర్ వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, అడ్వకేటుగారి ద్వారా గానీ, హాజరయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనియెడల వారి పరోక్షమందు పై ఇ.పి. తీర్మానము కాబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

బై ఆర్డర్
వాయిదా : 14-12-2022
విజయవాడ.
ది.02-12-2022

కునుకు రాజశేఖర్,
పిటీషనర్ తరపు అడ్వకేట్.
గాంధీనగర్, విజయవాడ.

In The Court of The Principal Senior Civil Judge at Gudivada
EP No. 15/2016 in OS No. 994/2014
(On The File of Prl Senior Civil Judge L.B. Nagar, Rangareddy, Hyderabad Court Suit)

Between:
Atkuri Yashwanth Reddy ...DHR
And
Sanaka Bhanu ...JDR
To.
JDR Address:
Sanaka Bhanu, W/o. Late Venkata Sita Ramanjaneyulu, R/o. H.No. 56-4-23/A, High School Road, Patamata, Vijayawada, Vijayawada Urban Mandalam

పై నెంబరు EP లో DHR యొక్క డిక్రి బాకి ఖర్చులు వగైరాలు రాబట్టుకొనుటకు తమకోర్టులో దాఖలు చేసిన Execetion Petition లో JDR కు Order 21 Rule 64 Notice నిమిత్తం ది. 19/12/2022వ తేదిన పై కోర్టు వారి యదుట వాయిదా కలదు. కావున సదరు వాయిదా తేదిన ఉదయం 10-30 ని॥ పై కోర్టు వారి యదుట JDR స్వయంగా గాని లేక అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

"By Court Order"

వాయిదా తేది: 19/12/2022

Gudivada
5/12/2022

Bathu Satyanarayana
Y. Ankineedu Prasad
DHR తరుపున న్యాయవాదులు
Gudivada, Cell No. 9985344499

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, గుడివాడ
ఇ.పి. 36/2022 ఇన్ ఓ.యస్.241/2016

బిట్వీన్:-
నక్క వెంకటేశ్వరరావు, తండ్రి రాఘవులు, కపిలేశ్వరపురం గ్రామం, పమిడిముక్కల మండలం ...డి.హెచ్.ఆర్
మరియు
కంటె నాగ ప్రసాద్, తండ్రి నాగేంద్రరావు, డోర్.నెం.16-171, కోటిరెడ్డి పేట, పామర్రు గ్రామం, పామర్రు మండలం. ...జె.డి.ఆర్

పై నెంబరు ఇ.పిలో శ్రీ కోర్టు వారు సి.పి.సి ఆర్డరు 21 రూల్ 22 క్రింద కోర్టు వారిచే జారీ చేయబడిన నోటీసును జె.డి.ఆర్‌కు పేపరు ప్రకటన ద్వారా అమలు చేయుటకు శ్రీ కోర్టువారు ఉత్తర్వులను జారీచేసి జె.డి.ఆర్. హాజరు అగుటకు ఇ.పి.ని ది.22-12-2022 వ తేదికి వాయిదా వేసియున్నారు. సదరు తేదిన జె.డి.ఆర్ స్వయంగా గాని వారి అడ్వకేట్ గారి ద్వారా గాని ఉదయం 10-30ని॥లకు పై కోర్టులో పై తేదిన హాజరు కావలయును అట్లు హాజరు కాని యెడల పై నెంబరు గల ఇ.పి ని జె.డి.ఆర్ పరోక్షమందు వారికి వ్యతిరేకంగా తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

గుడివాడ
తేది:3-12-2022

యస్.వి.పాండురంగరావు,
అడ్వకేట్,
గుడివాడ.

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, గుడివాడ
ఓ.యస్. 29/2022

బిట్వీన్:-
కొసరాజు వెంకట సుబ్బరావు, తండ్రి కోటేశ్వరరావు, డోర్.నెం.10-248/824, గుడివాడ. ...వాది
మరియు
1)కందుల లక్ష్మీ ప్రసన్న, భర్త రామకృష్ణరావు, డోర్.నెం.11/173, ఏలూరు రోడ్, గుడివాడ.
2)యమ్/యస్. ప్రసన్న హోమ్స్ ప్రైవేటు లిమిటెడ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ డైరెక్టర్, బొకినాల ప్రసాద రావు, తండ్రి యెషయ్య, డోర్.నెం.4-137, పెదసనగల్లు, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా. ...ప్రతివాదులు

పై నెంబరు దావాలో శ్రీ కోర్టు వారు 2వ ప్రతివాదికి నోటీసును పేపరు ప్రకటన ద్వారా అమలు చేయుటకు శ్రీ కోర్టు వారు ఉత్తర్వులను జారీ చేసి 2వ ప్రతివాది హాజరు అగుటకు దావాను 26-12-2022 వ తేదికి వాయిదా వేసియున్నారు. సదరు తేదిన 2వ ప్రతివాది స్వయంగా గాని వారి అడ్వకేటు గారి ద్వారా గాని ఉదయం 10-30ని॥లకు పై కోర్టులో పై తేదిన హాజరు కావలయును. అట్లు హాజరు కాని యెడల పై నెంబరు గల దావాను 2వ ప్రతివాది పరోక్షమందు వాదికి వ్యతిరేకంగా తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

గుడివాడ
తేది:3-12-2022

యస్.వి.పాండురంగరావు,
అడ్వకేట్, గుడివాడ.

IN THE HONOURABLE COURT OF THE MOTOR TRIBUNAL CUM II ADDL. DISTRICT JUDGE
M.V.OP No.129/2022

Between: **Boori Savitramma** and another --PETITIONERS
And: **Daram Rambabu** and 2 others --RESPONDENTS

NOTICE

To
R1 Daram Rambabu, S/o Late Yesubu, Hindu, aged about 56 years, Driver of the KVR Bus No. AP-27/X-4111, Residing at Yeravari Veedhi, near Anjaneya Swamy Temple, Masavaram, Vijayawada, Krishna District.
R2 **Vajja Padmalatha,** W/o Venkata Ramesh, Owner of the KVR Bus No. AP-27/X-4111, Rice Shop Street, Door No. 41-3-76, Krishna Lanka, Vijayawada Town, Krishna District.

Please take notice that the above matter is posted to 20.12.2022 at 10.30 A.M. for your notice to appear before the hon'ble court either In person or through an advocate for filing your counter if any falling which the matter will be heard in your absence.

L.GOVINDA RAJULU,
ADVOCATE, SRIKAKULAM

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE CUM APPELLANT AUTHORITY AT VIJAYAWADA
R.C..C.M.A. No .01/2020

Between :
Vibudi Naga sarala Devi and Others .... Appellants
And Pamidimarri Venkata Sambasiva Rao and Others ...Respondents
To 1. Vibudi Sumathi, (2 nd Respondent) W/ o. Late Srinivas,
2. Tanuku Pravalika, (3rd Respondent) W/ o. sri Harsha, D/ o. Late Srinivas,
3 . Vibudi Balaji Sai Mukesh, (4th Respondent) s/ o. Late Srinivas,
the Respondents 2 to 4 are residing in common Address. R/o. Flat No. 12, 3rd Floor, Swarna Residency, Opp. Rama Talkies, Gandhinagar, Vijayawada-520 003.

Please take Notice that the above Appeal is filed against the Respondents. The Respondents 2 to 4 to appear before the Hon' ble Principal Senior Civil Judge Court, Vijayawada in the above RCCMA No. 1/2020, in view of death of Late Vibudi Srinivas. The Hon'ble Court ordered Notice to Respondents 2 to 4 to you and posted the case to 09-12-2022 for your appearance. So you are here by directed to appear before the Hon'ble Court on 09-12-2022 at 10-30 A.M. failing which the in person or through your Advocate , matter will be decided in your absence.

(By Order of the Hon' ble Court)

T. Anjaneyulu, Advocate ,
Gandh inagar , Vij ayawada-3.
Date of Adjournment: 09-12-2022.

IN THE COURT OF THE HON'BLE DEPUTY RIGISTRAR OF CHITS NARASARAOPET.
DISPUTE NO. 199/2021

M/S ESWAR CHIT FUNDS PVT LTD, NARASARAOPET. REP BY ITS MANAGER & FOREMAN ... DISPUTANT.
V/S
Tirupadu Sarada. and Others. ... Opponents

Opp.No1- Tirupadu Sarada W/o Pallaki Subba Reddy, Principal, Government Junior Collage, Yaddanapudi village and mandal Bapatla District.
Opp No.4-Gonuguntla Purnachandra Rao S/o venkateswarlu, B.Ed., Assistant Kamalaniketan UP School, Ajitsingh Nagar Vijayawada Town, Krishna Dt.

పై నెంబర్ దావాలో మీరు ప్రతి వాదులై ఉన్నారు. కావున మీకు ఎన్ని మార్లు నోటీసులు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసుకు ఉత్తర్వులు జారీ చేసినందున ది.19-12-2022 న స్వయంగా కానీ లేదా అడ్వకేట్ ద్వారా కానీ హాజరయ్యి మీకు గల అభ్యంతరములు తెలుపుకోనవలెను. లేనియెడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానం చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా తేదీ. 19-12-2022
నరసరావుపేట.

ఇట్లు.
SK.HIMAMBI
ADVOCATE,
NARASARAOPET, PALNADU(D)

ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ సభ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

స్థానిక జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో వి.హేమలత అధ్యక్షతన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ సభ, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి డాక్టర్ అల్లాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్‌లోని పేరు, పుట్టిన తేది తదితర తప్పులను సరిచేసుకోవాలంటే వికలాంగులు ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే స్పందనలో అర్జీ పెట్టుకొని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే సవరణలు చేసే అవకాశం ఉందన్నారు. వికలాంగులు సంక్షేమశాఖ ఏడి రామ్ కుమార్ మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వికలాంగులకు అందేలా కృషిచేస్తున్నామన్నారు. ప్రముఖ న్యాయవాది అజ్మతున్నీసా మాట్లాడుతూ వికలాంగులకు ఉన్న చట్టపరమైన ఎలాంటి సమస్యనైనా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉ చి త ´ ం ∩ ¯ పరిష్కరిస్తున్నామన్నారు. ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ సంఘ సభ్యులందరూ సంఘటితంగా హక్కులను సాధించుకోవాలన్నారు. ఐద్వా నాయకురాలు వి.జ్యోతి మాట్లాడుతూ ప్రయివేటీకరణ విధానాలను వ్యతిరేకించాలని కోరారు. ఎన్పిఆర్ జిల్లా కార్యదర్శి ఎన్ఎస్ నారాయణ మాట్లాడుతూ వికలాంగుల చట్టం 2016ను ప్రభుత్వం వెంటనే అమలు చేసి విద్యా, ఉద్యోగాలలో 4శాతం, సంక్షేమ పథకాలలో 5 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఇద్దరు వికలాంగులకు ట్రై సైకిళ్ళు అందించారు. లక్ష్మణ్ అండ్ ట్రూప్ నిర్వహించిన పాటల కార్యక్రమం సభికులందరికీ ఉత్సాహాన్ని కలిగించింది. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్డీ జిల్లా కార్యదర్శి ఎన్. ఎస్. నారాయణ, పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, కార్యదర్శి నాగబాబు, జాయింట్ సెక్రటరీ శివ శంకర్, నాయకత్వం షరపున్, వెంకాయమ్మ, కామేశ్వరరావు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ సభకు హాజరైన ప్రతినిధులు

నేడు పాఠశాల భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉంగుటూరు

ఉంగుటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనాల ప్రారంభోత్సవం గురువారంనాడు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా జరుగుతుందని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, జిల్లా పరిషత్ అధ్యక్షులు ఉప్పాల హారిక, ముఖ్య ప్రజా ప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

అంబేద్కర్‌కు ఘనంగా నివాళి

ప్రజాశక్తి-ఘంటసాల

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్థంతిని పురస్కరించుకుని మంగళవారం ఘంటసాల మండల పరిధిలో గ్రామ గ్రామాన అంబేద్కర్ అభిమానులు అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిట్టూర్పు సచివాలయం వద్ద సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీ లక్ష్మీ కృష్ణవేణి, జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కె.కె.ఆర్ గౌతమ్ విద్యార్థులు ఎంపిక

గుడివాడ : త్వరలో జరిగే రాష్ట్రస్థాయి జరిగే కళా ఉత్సవ్ పోటీలకు కె.కెఆర్ గౌతమ్ విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపల్ ఎం.సత్యరామ్, ఆర్.జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే...

సోమ,మంగళవారాల్లో జరిగిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో గౌతమ్ స్కూల్ విద్యార్థులు శాస్త్రీయ, జానపద, సంగీతం, నృత్యం, చిత్రలేఖనంలో పోటీల్లో పాల్గొని జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచారన్నారు. త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎస్. డింపుల్ హర్షిత, బి.వి తేజ, సి.బృందావని, కె.ఎస్ త్రిభువన, ఎస్.సాయిప్రణవి, జి.మోహిత్, డి.విష్ణువర్ధనిలు ఎంపికైనట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి, పెనమలూరు,

తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు బుధవారం కమీషనర్ ప్రకాశరావుకు వినతిపత్రం అందజేశారు. 2 సంవత్సరాలుగా కార్మికులకు రావలసిన బట్టలు, సబ్బులు, చెప్పులు, కొబ్బరినూనె కొంత మందికి మాత్రమె ఇచ్చారని, కార్మికులకు సేఫ్టీ పరికరాలు అందించాలని కోరారు. 60 సంవత్సరాలు దాటిన కార్మికును పనుల నుండి నిలుపుదల చేశారని వారి స్థానంలో వారి పిల్లలకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పాడ త్రిమూర్తులు, వై. సరళ, యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రక్తనమూనాల సేకరణ కార్యక్రమం

రక్త నమూనా నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్1 యూత్ రెడ్ క్రాస్ విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ డ్రెస్ సొసైటీ అవనిగడ్డ బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో రక్త నమూనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్ డ్రెస్ సొసైటీ అవనిగడ్డ బ్రాంచ్ చైర్మన్ వంగర శేషగిరిరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రక్తదానం ఆవశ్యకతని తెలుపుతూ రక్త నిర్ధారణ గురించి వివరించారు. ప్రిన్సిపాల్ ఉమారాణి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన రక్త వర్గం తెలుసుకొని ఉండటం ఎంత అవసరమన్నారు.వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె వి శాంతకుమారి మాట్లాడుతూ రక్త వర్గ నిర్ధారణ చేయించుకోవడం వల్ల ఆపదలో ఉన్న వారికి అత్యవసర సమయంలో సహాయం చేయొచ్చునన్నారు. మచిలీపట్నం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నుండి వచ్చిన టెక్నీషియన్ ఆనంద్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ సాయి అరుణ్ రక్త వర్గ నిర్ధారణ పై అవగాహన కల్పించారు. 100 మంది విద్యార్థులకు రక్త నిర్ధారణ నమూనా పరీక్షలు నిర్వహించారు. రక్తం గ్రూపు నిర్ధారణలు చేశారు. రక్త నమూనా నిర్ధారణ పరీక్షలపై బీఎస్సీ ఆక్వాకల్చర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఉపయుక్తమైన కార్యక్రమం ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ యూత్ రెడ్ క్రాస్ విభాగాధిపతి వీర కుమారిని ప్రిన్సిపాల్ అధ్యాపకులు అభినందించారు.

శ్రీశైలం బయలుదేరిన శివస్వాములు

ప్రజాశక్తి-ఘంటసాల

శ్రీకాకుళం గ్రామానికి చెందిన శివ స్వాములు మండల దీక్షను స్వీకరించి ఇరుముడులు ధరించి దీక్ష విరమణ కోసం బుధవారం శ్రీశైలానికి బయలు దేరారు. శ్రీకాకుళంలోని ఏకరాతి ప్రసన్న మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో ఉదయం నాలుగు



గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలను స్వామికి నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివ స్వాములు సిహెచ్.వర్షవర్ధన్, కొండవీటి కోటేశ్వరరావు (కోటి), అంబటి నాగరాజు, ఆకుల అనిల్, సాయి, ఏకరాత్రి ప్రసన్న మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ రావూరి శ్రీనివాసరావు (వాసు)లు నాలుగు ప్రత్యేక వాహనాలలో శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఆలయ అర్చకులు స్వర్ణ వెంకటేశ్వరరావు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.



తాడిగడప మున్సిపాలిటీలో వినతిపత్రాన్ని అందజేస్తున్న సిపిఎం నాయకులు

బిజెపితో లౌకికవాదానికి ప్రమాదం : రఘు

ప్రజాశక్తి-గన్నవరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వతీరుతో లౌకికవాదానికి అత్యంత ప్రమాదకరమని సిఐటియు మాజీ జిల్లా నాయకులు ఆర్.రఘు అన్నారు. సిఐటియు 11వ జిల్లా మహాసభలు గన్నవరంలో జరుగుతున్న సందర్భంగా గన్నవరం మండలం



మాట్లాడుతున్న ఆర్.రఘు

చనుపల్లి వారి గూడెంలో అంబేద్కర్ వర్థంతి, బాబ్రీ మసీదు విధ్వంసాన్ని పురస్కరించుకొని 'రాజ్యాంగంపై దాడి...మన కర్తవ్యం' అనే అంశంపై బుధవారం రాత్రి సదస్సు జరిగింది. సిఐటియు గన్నవరం మండలం ఉపాధ్యక్షులు బెజవాడ తాతబ్బాయి అధ్యక్షత వహించారు.ఈ సదస్సులో రఘు మాట్లాడుతూ గతంలో బ్రిటిష్ వారు విభజించు పాలించు నినాదాన్ని పాటించి ప్రజలను విడదీసి కాలం గడుపుకున్నారన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని ,ప్రజాస్వామ్యాన్ని, స్వాలంబనను నీరు కార్చే పద్ధతిలో పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కృష్ణాజిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి, బుద్దాల సత్యం,జాలది సుబ్బారావు,గోపి, నాని తదితరులు పాల్గొన్నారు.

ఎంఇడి అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలి

ప్రజాశక్తి-గుడివాడ

గత 20 సంవత్సరాలుగా ఎంతోమందిని ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన ఎంఇడి అభ్యర్థులు నేడు ఉద్యోగ అవకాశాలు లేక రోడ్డున పడ్డారనీ, రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి ఉపాధి అవకశాలు కల్పించాలని రాష్ట్ర ఎంఇడి



మాట్లాడుతున్న బి.రమేష్; నిర్మలకుమారి, సుచరిత

అభ్యర్థుల సంక్షేమ సంఘం కన్వీనర్ బి.రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్‌జివో హోంలో ఏర్పాటుచేసిన విలేకర్లు సమావేశంలో సంక్షేమ సంఘం మహిళా కన్వీనర్లు పి.నిర్మలకుమారి, జి.సుచరితలతో కలసి రమేష్ మాట్లాడారు. అర్హత కలిగి ఎంఇడి పూరి చేసిన 10వేల మంది నిరుద్యోగులుగా ఉన్నామని వివరించారు. గత 20 సంవత్సరాలుగా ప్రయివేటు డిఎడ్, బిఎడ్ కాలేజీల్లో అనేక వేల మందిని ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన తమ కుటుంబాలు నేడు ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. 1988 నుండి గత ఏ ప్రభుత్వమూ ఎంఎడ్ అర్హతతో ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ, ప్రభుత్వ డైట్, బిఎడ్ కాలేజీల్లో నియామకాలు చేపట్టలేదన్నారు. ఉపాధి ఇచ్చే నోటిఫికేషన్స్ అందుబాటులోకి రాక తమ వయస్సు ఉద్యోగ అర్హతకు దాటిపోయిందన్నారు. రానున్న నోటిఫికేషన్లలో తమకు ప్రత్యేక గ్రేస్ మార్కులు ఇవ్వాలనీ, అవుట్ సోర్సింగ్ పోస్టుల్లోనైనా నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఇఒ 1,2 నియామకాలు, ప్రభుత్వ డైట్, బిఎడ్ కాలేజీల్లో నియామకాలు చేపట్టాలన్నారు. డిప్యూటీ డిఇఒ నియామకాలు, సచివాలయంలో ఎడ్యుకేషనల్ సెక్రటరీ, నాడు-నేడు పథకాలలో నియామకాల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: మండల స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిని స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి పాఠశాలలో మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని, నిధులు ఉన్నప్పటికి పాఠశాలలోని విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాలయలను కల్పించలేకపోవడం విచారకరమన్నారు. రెడ్డిగూడెం మండలంలో పాఠశాలల నాడు నేడు పనులలో అంచనాలు కూడా వేయకపోవడంపై కలెక్టర్ అగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని నాడు- నేడు పనులలో మంజూరైన నిధులను ఆయా పనులకు ఖర్చు చేసి లక్ష్యాలను సాధించాలన్నారు. సమావేశంలో జాయింట్‌కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, నందిగామ ఆర్‌డివో ఎ.రవీంద్రరావు, తిరువూరు ఆర్‌డివో వైవి ప్రసన్న లక్ష్మి, హౌసింగ్ పిడి శ్రీదేవి, డిఇవో సివి రేణుక ఉన్నారు.



సమస్యలు తలెత్తకుండా రీ-సర్వే

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా రీ సర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భూ రికార్డుల క్షేత్రస్థాయి ప్రక్షాళనలో భాగంగా గ్రామాలలో చేపట్టే భూ సర్వే ప్రక్రియకు మండల స్థాయిలో నియమించబడిన అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ పూర్తయిన మండల ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ గ్రామ స్థాయి టీమ్‌లకు శిక్షణ అందించాలని కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్‌లో భూవివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా భూ హక్కు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

రూ.లక్ష చెక్కు అందజేత

జి. కొండూరు మండలం చెవుటూరు గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మణ్‌రావు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలో ఉంటూ వైద్యం అందించడంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లక్ష్మణ్ కుటుంబ సభ్యులు సిఎం జగన్ దృష్టికి తీసుకు వచ్చేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో కాన్వాయ్ నుండి వారిని గమనించిన ముఖ్యమంత్రి అధికారుల ద్వారా వివరాలను తెలుసుకున్నారు. సిఎం ఆదేశాల మేరకు తన్నీరు లక్ష్మణ్‌రావుకు మెరుగైన వైద్య ఖర్చుల కింద జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తక్షణ ఆర్థిక సాయంగా లక్ష రూపాయల చెక్కును నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో కుటుం సభ్యులకు అందజేశారు.

గోకుల్ జ్యోతి బిజినెస్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: రాష్ట్రంలోని వ్యాపారవేత్తల సమ్మేళనం కోసం గోకుల్ జ్యోతి మాసపత్రిక రూపొందించిన బిజినెస్



క్యాలండర్ - 2023ని ఓంకార్ ఫైనాన్సియర్స్ అధినేత దూది బ్రహ్మయ్య యాదవ్ ఆవిష్కరించారు. స్థానిక బంగ్లా రోడ్‌లోని ఓంకార్ ఫైనాన్స్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆవిష్కర్త బ్రహ్మయ్య మాట్లాడుతూ వ్యాపారులు ఐక్యతతో అభివద్ధి సాధించాలన్నారు. ఒకే వేదికపై వ్యాపారులు కలిస్తే పురోభివద్ధికి తగిన సానుకూల నిర్ణయాలు తీసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో శ్రీ కష్ణ డోర్స్ అండ్ ప్లైవుడ్స్ అధినేత మాదాల వాసుదేవ్ ,పూజల శ్రీనివాసరావు, కొనికి కొండయ్య, గోకుల్ జ్యోతి అధినేత లక్ష్మినారాయణ, వ్యాపారవేత్త కనకం వెంకటేశ్వర్లు (లక్షాధికారి), కాకు బాలనారాయణ, పరిశపోగు రాజేష్, షేక్ రజియ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

9న రుద్రరాజు ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఈ నెల 9వ తేదీన వేదిక కళ్యాణ మండపంలో జరిగే కాంగ్రెస్ పార్టీ ఎపి కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజయవాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ నూతన అధ్యక్షునిగా పదవి బాధ్యతలు చేపట్టనున్న రుద్రరాజుకు అభినందనలు తెలిపారు.

బీసీల ద్రోహి జగన్ : బుద్దా



ప్రజాశక్తి-వన్‌టౌన్: బీసీల ద్రోహి సీఎం జగన్ అని, బీసీ మహాసభ జరిపే అర్హత వైసీపీకి లేదని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ధ్వజమెత్తారు. బీసీల సమస్యలపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు బుధవారం వన్‌టౌన్‌లోని తన ఇంటి నుంచి బయలుదేరిన ఆయన్ను పోలీసులు అడ్డుకుని గృహనిర్భంధంలో ఉంచారు. దీంతో ఆయన తన ఇంటి వద్ద టిడిపి కార్యకర్తలతో కలసి బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బుద్దా మాట్లాడుతూ బీసీలకు జగన్ ప్రభుత్వం ద్రోహం చేస్తోందని, బీసీలను ఓటు బ్యాంక్ రాజకీయాలకు వాడుకొంటోందని విమర్శించారు. బీసీ కార్పొరేషన్లకు నిధులివ్వకుండా బీసీలను జగన్ అణగదొక్కుతున్నారని ఆరోపించారు. బీసీలకు చంద్రబాబుతోనే న్యాయం జరుగుతుందని పేర్కొంటూ చంద్రబాబు కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాదరబోయిన ఏడుకొండలు, నాయకులు ఉమ్మడి చంటి, కొట్టేటి హనుమంతరావు, పేరాబత్తుల రమణ, గణపా రాము, పత్తి నాగేశ్వరరావు, ఈగల సాంబ, రాజగిరి అశోక్, తుపాకుల వెంకటేశ్వర్లు, షేక్ సుభాని, రాయన రాజా, తెలుగు మహిళ నాయకురాళ్ళ ప్రసన్నలక్ష్మి వల్లభనేని, బూదాల నందకుమారి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తుల్లో అగ్రగామి కోరమాండల్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అగ్రశ్రేణి వ్యవసాయ ఉత్పత్తుల సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో కృషి చేస్తుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఎ.అరుణ్ అన్నారు. ఎం.జి.రోడ్డులోని సంస్థ కార్యాలయంలో సంస్థ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయ్న మాట్లాడుతూ తమ సంస్థ ఉత్పత్తులను అందించడమే కాకుండా సంపూర్ణ వ్యవసాయ పరిష్కారాలను కూడా అందిస్తుందన్నారు. సాంకేతిక అధారిత వ్యవసాయంలో వ్యూహాత్మకమైన పెట్టుబడులను కోరమాండల్ పెడుతూ, సూక్ష్మ వ్యవసాయం చేపట్టడం ద్వారా రైతుల ఉత్పాదకనతు పెంచడంలో రైతులకు అండగా నిలుస్తుందన్నారు. కోరమాండల్ సంస్థ వెంచర్ క్యాపిటల్ విభాగమైన డేర్ వెంచర్స్ ద్వారా పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. రానున్న కాలంలో సంస్థ అధివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు.

నిరుపేదలకు నాణ్యమైన విద్యే లక్ష్యం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: నిరుపేదలైన పిల్లలకు నాణ్యమైన విద్య,ఉధ్యోగ అవకాశలను పెంపోందించడమే మురళికష్ణ ట్రస్ట్,ఇటలీ కేర్ షేర్ లక్ష్యమని ఇటలీ కేర్ షేర్ అధ్యక్షురాలు ఎలిజబెత్తజీనా పేర్కొన్నారు. బుధవారం స్టెల్లా కాలేజి



ఆడిటోరియంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమే మాట్లాడుతు భారత దేశంలో అధికంగా యువత ఉంది ఆ యువతకు సరియైన నైపుణ్యం అందిస్తే దేశం మరింత అభివద్ధి చెందుతుందన్నారు.పిల్లలకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంగా స్కూల్ ఫర్ ఫ్యూచర్ ని అనే కాన్సెప్ట్ ను తీసుకొస్తున్నట్లు తెలిపారు.మురళి కష్ణ ట్రస్ట్ ఇటలి టీమ్ తో కలసి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు అణుగుణంగా ఉద్యోగ అవకాశలను పెంపోందించే విధంగా స్కిల్ డవలప్ చేసే విధంగా పిల్లలను మోటివేషన్ చేస్తామని తెలిపారు.నేడు చదివేది ఒకటీ చేసేది ఒకటని ఆవేధన వ్యక్తం చేశారు.ఆటటడుగు వర్గాల పిల్లలకు కూడ జీవనోపాధితో కూడిన విద్యను అందించడం అందుకు అణుగుణంగా పిల్లలను తీర్చిదిద్దుతామన్నారు.ఈ కార్యక్రమంలో ఇటలీకి చెందిన అంటోనియో బెంజి,మురళి కష్ణ ట్రస్ట్ కలిసి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్ననట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇటలి నుండి కేర్ షేర్ ప్రతినిధులు,మురళి కష్ణ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బిసిల హృదయాల్లో జగన్‌కు స్థానం లేదు : పోతిన

ప్రజాశక్తి-వన్‌టౌన్: బీసీల హృదయాల్లో జగన్‌కు స్థానంలేదని, వాటిని వెన్నుపోటు పొడిచి నాటకాలు ఆడుతున్నారని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పోతిన వెంకటమహేష్ విమర్శించారు. బుధవారం కొత్తపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖ అనాధ సంక్షేమ శాఖగా మారిపోయిందన్నారు. జయహో బీసీ సభలో పాల్గొన్నది బీసీలు కాదని ఎద్దేవా చేశారు. బీసీలకు మాటల్లో వాటాలిస్తూ చేతల్లో జగన్ మోసం చేస్తున్నారన్నారు. 56 బీసీ కార్పొరేషన్లు జగన్ భజన చేయడానికే ఉన్నాయన్నారు. కుల, చేతివత్తులను జగన్ నిర్వీర్యం చేశారని విమర్శించారు.

యోగా, నెట్‌బాల్ పోటీలకు ఎంపికలు పూర్తి

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉమ్మడి కష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో యోగా, నెట్ బాల్ బాలుర, బాలికల విభాగంలో ఎంపిక ప్రక్రియలు బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ బి సురేష్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా నిడమానూరు గ్రామ సర్పంచ్ శీలం రంగారావు పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి శ్రీ తోట అజయ్ ఈ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చిన స్కూల్ పీడీలు పూర్ణచంద్రరావు రాజేంద్రకుమార్ బలరాం పాల్గొన్నారు.



ముగిసిన ఐటి అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ ఇంట్లో ఐటి శాఖ అధికారులు తనిఖీలు ముగిశాయి. మంగళవారం ఉదయం 8 గంటల నుండి బుధవారం ఉదయం ఆరు గంటల వరకు తనిఖీలు జరిగాయి. ప్రధానంగా హైదరాబాద్‌కు చెందిన లాండ్ డెవలప్‌మెంట్ ఒప్పందంపై అవినాష్‌ను అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. అనంతరం బుధవారం ఉదయం దేవినేని అవినాష్ మీడియాతో మాట్లాడుతూ ఐటి శాఖ అధికారులకు తాను పూర్తిగా సహకరించినట్లు తెలిపారు. ఐటి శాఖ అధికారులు వారి వద్ద ఉన్న అఫిడవిట్ సమాచారం మేరకు తనిఖులు చేశారు. ఇవి సాధారణంగా జరిగినవేనన్నారు. ఐటి సోదాలలో ఎటువంటి అక్రమాలు బయటపడలేదని, అన్నారు. దేవినేని కుటుండం మొదట నుండి రాజకీయాల్లో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నామని తెలిపారు.


120 మందికి జగనన్న తోడు

ప్రజాశక్తి-భవానీపురం: చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకం ఓ గొప్ప వరమని, చిరు వ్యాపారులు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. బుధవారం 44వ డివిజన్ లేబర్ కాలనీలోని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 120 మంది చిరు వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జగనన్న తోడు పథకం కింద వడ్డీ లేని రుణాలను కార్పొరేటర్ అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రత్నకుమారి మాట్లాడుతూ చిరు వ్యాపారులు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పు తీసుకుని ఆర్థికంగా చితికిపోయే వారన్నారు. ఆ విషయాన్ని గమనించిన సీఎం జగనన్న చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాన్ని అందించేలా జగనన్న తోడు పథకాన్ని ప్రవేశపెట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రూప్ సిఓ వనజ, సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీలు రాధాకష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ కోర్సులతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ వల్ల వైద్య, విద్య, ఆర్థిక, డిజిటల్ మార్కెటింగ్ రంగాలతోపాటు శాస్త్ర, సాంకేతిక రంగాలలోనూ మంచి ఉద్యోగవకాశాలు ఉన్నాయని బెంగళూరుకు చెందిన క్రేన్స్ యూనివర్శిటీ ప్రతినిధులు భువనేశ్వరి, భవానీ శంకరి తెలిపారు. విజయవాడ రూరల్



మండలం నున్నలోని వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రేన్స్ యూనివర్సిటీ సహకారంతో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్రేన్స్ యూనివర్సిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థులకు మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ ఆధునాతన టెక్నాలజీ పాత్ర ఎంతగానో ఉందన్నారు. నేటి సమాజంలో డేటా సైన్స్ అవశ్యం ఎంతగానో ఉందని, ఈ రంగాలలో ప్రావిణ్యం సంపాదిస్తే, విద్య, వైద్య, రోబోటిక్, ఎరోనాటిక్, ఆర్థిక, బ్యాంకింగ్, డిజిటల్ రంగాలలో మంచి ఉద్యోగవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు వారు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ నరెడ్ల సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమణ, వైస్ ప్రిన్సిపాల్ బివి రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతులు బి సురేష్, ఎం అశోక్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్ కిశోర్ బాబు పాల్గొన్నారు.